క్లుప్తంగా

వైభవంగా ఆరాధన మహోత్సవం



గ్రామోత్సవంలో దర్శనమిస్తున్న స్వామివారు

సైదాపురం: మండలంలోని ఊటుకూరు ఉన్న వెంకయ్య స్వామి ఆలయం ఆదివారం ఆరాధన కార్యక్రమం అత్యంత వేడుకగా నిర్వహించారు. శ్రీభగవాన్ వెంకయ్యస్వామిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. స్వామి వారికి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం ప్రత్యేక అభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివార్లను వివిధ పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం అగ్నిగుండం కార్యక్రమాన్ని వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా ప్రారంభించారు. పిల్లలు పండరి భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

నెలబల్లిలో అన్నదానం



భోజనం ప్యాకెట్లు అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామంలోని నిరుపేదలకు తడ కండ్రిగ ప్రాంతానికి చెందిన శ్రీకృష్ణా ఫౌండేషన్ సంస్థ నిర్వాహకులు ఆదివారం భోజనం ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. నెలబల్లి గ్రామానికి చెందిన మునస్వామి జ్ఞాపకార్థం అన్నదానం చేసినట్లు సంస్థ నిర్వాహకులు నాగరాజు తెలియజేశారు.

కలుషిత నీళ్లే ఇక్కడ దిక్కు



ఆనేగొట్టం గ్రామ చెరువులో తవ్విన బావి

దొరవారిసత్రం: మండలంలోని ఆనేగొట్ట గ్రామంలో ప్రజలకు మంచి నీటి పథకం నుంచి వచ్చే కలుషిత నీళ్లే దిక్కుగా మారాయి. స్థానికంగా ఎక్కడా నీటి వనరులు లేకపోవడంతో గ్రామ సమీపంలో ఉన్న చెరువు మధ్యలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వారు ఓ బావిని తవ్వి విద్యుత్ మోటారు ఏర్పాటు చేసి ఆనేగొట్టం గ్రామానికి తాగు నీళ్లు సరఫరా చేస్తున్నారు. ఈ బావి ప్రస్తుతం చెరువు నీటితో మునిగిపోయి బావిలో నీళ్లు అంతా కలుషితం. వాటినే తాగడం, వినియోగించడం వల్ల శరీరం అంతా దురదలు, అప్పుడప్పుడు విరేచనాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ పాలకులు, కాని సచివాలయం సిబ్బంది కాని బావిలో క్లోరినేషన్ చేసే పరిస్థితి లేదని చెబుతున్నారు. స్థానికంగా ఎక్కడా తాగు నీటి వనరులు లేకపోవడంతో ఈ కలుషిత నీళ్లే తాగాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫైనాన్స్ సిబ్బంది చేతివాటంపై ఫిర్యాదు



పోలీసుస్టేషన్ ఎదుట బాధితులు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. కస్టమర్లకు తెలియకుండానే వారి పేర్ల మీద లోన్లు మంజూరు చేసి ఇతర వ్యక్తులకు పరికరాలు అందించారు. ఈఎంఐ చెల్లించాలని కస్టమర్ కేర్ నుంచి ఫోన్ రావడంతో బాధితులు అవాక్కయ్యారు. వాస్తవాలు ఆరా తీయగా.. పట్టణంలోని పలు షోరూమ్‌ల నుంచి కొంతమందికి తమ పేరు మీద లోన్ తీసుకుని పరికరాలను డెలివరీ చేసినట్లు తెలిసిందని బాధితులు వాపోతున్నారు. దీంతో రూ.లక్షల్లో మోసపోయినట్లు ఆరోపించారు. ఈ మేరకు 8 మంది బాధితులు ఆదివారం హుటాహుటిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు		25-8-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	105
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	196
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	216
లేయర్ చికెన్	:	200

భక్తులకు పోలేరమ్మ తల్లే దిక్కు

- గత ఏడాది అడుగడుగునా వైఫల్యమే.
- జాతర నిర్వహణకు ముందస్తు చర్యలేవీ?
- మరో రెండు రోజుల్లో పోలేరమ్మతల్లి తొలిచాటింపు
- ఈ ఏడాదైనా జాతర సాఫీగా జరిగేనా?



జాతరలో కొలువైన పోలేరమ్మతల్లి అమ్మవారు (ఫైల్)

సైదాపురం/వెంకటగిరి రూరల్: ప్రసిద్ధి చెందిన వెంకటగిరి శక్తిస్వరూపిణి పోలేరమ్మతల్లి జాతరలో భక్తులను ఆ తల్లే కాపాడుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది అయినా వైఫల్యాలు లేకుండా జాతర సాగుతుందా అన్న ఆందోళన భక్తుల్లో నెలకొంది. గత ఏడాది అడుగడుగునా ఆంక్షలు, పోలీసు ఓవరాక్షన్‌తో భక్తులు నానా అవస్థలు పడ్డారు. స్థానికులు పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయం ఆ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కూడా చెప్పడం గమనార్హం.

వెంకటగిరి పోలేరమతల్లి జాతరకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ పోలేరమ్మ తల్లి జాతరకు ఈ నెల 27వ తేదీన తొలి చాటింపు వేయనున్నారు. సెప్టెంబర్ 3న రెండో చాటింపు, 7వ తేదీన ఘటోత్సవం, 11, 12 తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయశాఖ, రెవెన్యూ, పోలీసు, సంబంధిత ఉన్నత అధికారులు ముందస్తు ఏర్పాట్లపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. అయితే ఈనెల 20వ తేదీన గూడూరు డీఎస్పీ గీతా కుమారి మాత్రమే పర్యటించి జాతర ప్రదేశాలను పరిశీలించారు. గతంలో అయితే జిల్లా స్థాయి పోలీసు, ఉన్నతాధికారులు పలుమార్లుగా సందర్శించి తగిన ఏర్పాట్లు చేసేవారు. ప్రస్తుతానికి అమ్మవారి ఆలయం, మండపాలకు మాత్రం రంగులద్దేపనిలో ఉన్నారు.

జాతర కమిటీ ఏదీ?

జాతర నిర్వహణకు తాత్కాలిక కమిటీని నియమిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.50లక్షలు, మున్సిపాలిటీ నుంచి రూ.41లక్షలు, టీవీఎస్ నుంచి మరో 50శాతం నిధులతో సుమారు. రూ.కోటికి పైగా నిధులు జాతర నిర్వహణకు ఖర్చు చేయనున్నారు. జాతరలో పాల్గొనే భక్తులు అమ్మవారికి రూ.కోట్లలో విరాళాలు సమర్పిస్తారు. రూ.కోట్లు ఖర్చు చేసి, వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులతో కలిసి నిర్వహించే పోలేరమ్మతల్లి జాతరకు ఇప్పటివరకు ఆలయ కమిటీ ఏర్పాటు చేయలేదు. అయితే పోలేరమ్మతల్లి జాతర నిర్వహణ ఖర్చు వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా అడిగినా దేవాదాయశాఖ లెక్కలు బహిర్గతం చేయకూడదని సాక్షాత్తు ఆలయ ఈఓ అధికారికంగా పత్రాలు జారీ చేస్తున్నారు. వాస్తవానికి పోలేరమ్మతల్లి ఆలయం కమిటీ నియామకానికి ఈ నెల 8వ తేదీన ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా ఇంత వరకు ఎటువంటి పత్రాలు తమకు అందలేదని ఆలయ ఈఓ తెలియజేయడం గమనార్హం.

గత ప్రభుత్వ హయాంలో 5 రోజుల పండుగ

గత ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం నిధులు విడుదల సందర్భంగా వెంకటగిరికి విచ్చేసిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థన మేరకు వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. ఆ మేరకు ప్రత్యేక నిధులు కేటాయించి, రెండు రోజుల జాతరను 5 రోజుల పండుగగా మార్చారు. అప్పుడు సంప్రదాయబద్ధంగా, అమ్మవారి జాతర ఎటువంటి లోటుపాట్లు లేకుండా అత్యంత వైభవంగా సాగింది.

గత ఏడాది వైఫల్యాలు

- జాతరలో ప్రారంభ ఘట్టం ఘటోత్సవం సందర్భంగా అమ్మవారి ఘటుమ గుంటలతో పాటు దున్నపోతుకు రాజాల సారెతో తొలుత పూజలు నిర్వహించడం ఆనవాయితీ. కానీ ఆ పూజలు నిర్వహించలేదు.
- వీఐపీల రాకతో పోలీసులు నానా హంగామా చేశారు. సాధారణ భక్తులకు దర్శనం కష్టతరంగా మారింది.
- దర్శన సమయంలో స్థానిక ప్రజా ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం , తోపులాట చోటుచేసుకుంది.
- సాక్షాత్తు అమ్మవారి దేవస్థానం ఈవోను సైతం పోలీసులు పక్కకి నెట్టివేశారు.
- ఘటుం కుండల ఊరేగింపు సమయంలో తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో పలువురు భక్తులు డ్రైనేజీ కాలువలోపడి గాయాల పాలయ్యారు.
- అదే సమయంలో పోలీసులు లాఠీలతో అత్యుత్సాహం ప్రదర్శించడంతో ఘటుం కుండలు సైతం పగిలిపోయాయి. దీంతో పాటు అమ్మవారి విగ్రహం స్వల్పంగా దెబ్బ తింది.
- నిష్క్రమణ సమయంలో అమ్మవారి మట్టి కోసం భక్తులతోపాటు అక్కడ డ్యూటీ చేసి పోలీసులు సైతం ఎగబడడంతో సంప్రదాయబద్ధంగా జరగలేదు.



భక్తుడిని తోసేస్తున్న పోలీసులు (ఫైల్)



పోలీసులను ప్రశ్నిస్తున్న భక్తులు (ఫైల్)

పోలేరమ్మకు కలశాభిషేక పూజలు



కలశాభిషేక పూజలు చేస్తున్న పండితులు

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలో వెలసిన శ్రీ పోలేరమ్మ అమ్మవారు ఆలయంలో ఆదివారం కలశాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దీవి అనంతాచార్యులు అమ్మవారుకి 58 కలశాలతో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టుకుని మొక్కులు చెల్లించారు. శక్తి స్వరూపిణి గీతాలతో మహిళలు భజనలు చేశారు.

శ్రీనివాససత్రం బీచ్‌లో నిమజ్జనం

కోట: వినాయక నిమజ్జనానికి మండలంలోని శ్రీనివాససత్రం బీచ్‌లో అవకాశం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ జయజయరావు, ఎస్ఐ పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. అధికారులు శ్రీనివాససత్రం బీచ్‌ను పరిశీలించి తగిన ఏర్పాట్లు చేశారు. ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలను జరుపుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రశాంతంగా జరుపుకుందాం

వెంకటగిరి రూరల్: రానున్న వినాయకచవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకుందామని వెంకటగిరి సీఐ ఏవీ రమణ పిలుపునిచ్చారు. పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో ముస్లిం మతపెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. శాంతియుతంగా వినాయక చవితిని జరుపుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు.

ముమ్మరంగా పోలీసుల సోదాలు



వైఎస్సార్ కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ కిషోర్‌బాబు

చిల్లకూరు : గూడూరులో ఇటీవల చోటు చేసుకున్న పలు సంఘటనల కారణంగా పోలీసులు ముందస్తుగా తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఇందులో భాగంగానే గూడూరు రెండు పట్టణాలతో పాటుగా రూరల్ సీఐల ఆధ్వర్యంలో స్లమ్ ఏరియాలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. గూడూరు ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణ ప్రాంతంలో రౌడీషీట్లను పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒక వైపు వినాయక చవితి దగ్గరలో ఉండడం ఇటీవల జీవిత ఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్, అతని ప్రియురాలు అరుణ వ్యవహారం పోలీసులకు తలనొప్పిగా మారడంతో ముందుస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. రూరల్ సీఐ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో క్రిష్ణాపురం, రెవెన్యూ కార్యాలయం పక్కనే ఉన్న వైఎస్సార్ కాలనీలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. వినాయక చవితికి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే సమయంలో ఖచ్చితంగా పోలీసు నిబంధనలు పాటించాలని విగ్రహం ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట చిల్లకూరు, గూడూరు ఒకటో పట్టణ ఎస్‌ఐలు కిషోర్‌బాబు, తిరుపతయ్య, సిబ్బంది ఉన్నారు.

కండలేరులో 31.7 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 31.7 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,820 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1200, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మాతా పరమేశ్వరికి నెలవారీ పొంగళ్లు

చిల్లకూరు: మండలంలోని కడివేడు గ్రామంలో ఉన్న మాతా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో తిరునాళ్లు నిర్వహించి నెల రోజులు పూర్తి కావడంతో గ్రామస్తులు అమ్మవారికి నెలవారీ పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని కుటుంబాలన్నీ అమ్మవారి ఆలయం చేరుకుని పొంగళ్లు పెట్టడంతో ఆ ప్రాంతం కళకళలాడింది.

చదరంగంతో మేధో సంపత్తి

వెంకటగిరి రూరల్ : చదరంగం ఆడడం ద్వారా మేధో సంపత్తి పెరుగుతుందని వెంకటగిరి రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ నుంచి సుమారు 280 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఒక్కప్పుడు రాజుల వరకే పరిమితమైన క్రీడా పోటీలు నేడు మారుమూల గ్రామాల సైతం విస్తరించాయన్నారు. క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెస్ అకాడమీ నిర్వాహకుడు నర్రా వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాకాణిని కలసిన గూడూరు నాయకులు



కాకాణిని కలసిన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు

చిల్లకూరు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డికి హైకోర్టు నెల్లూరుకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వడంతో ఆయన ఆదివారం నెల్లూరుకు వచ్చారు. దీంతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కాకాణిని వారి నివాసంలో కలిశారు. మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులకు గురి చేసినప్పటికీ తన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని అన్నారు. కాకాణిని కలసిని వారిలో గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, హమేంద్ర, ప్రభాకర్‌రాజు, కొట్టు అశోక్, ప్రసాద్ ఉన్నారు.

కలప లూటీని అడ్డుకున్న గ్రామస్తులు



కలప తీసుకెళ్లకుండా అడ్డుకున్న గ్రామస్తులు

చిట్టమూరు: మండల పరిధిలోని ఈశ్వరవాక చెరువు కట్టపై ఏపుగా పెరిగిన వేప చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్న కూటమి నేత ఆగడాలను గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. వేప చెట్లను నరికి లారీ, ట్రాక్టర్లకు లోడ్ చేస్తుండగా గ్రామస్తులు మూకుమ్మడిగా చెరువు కట్టవద్దకు చేరుకుని కలపను తరలించకుండా అడ్డున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ చెరువు కట్టపై ఉన్న కలపను వేలంపాట నిర్వహించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించాలని తీర్మానించామన్నారు. ఇందుకు సంబంధించి అటవీ శాఖ, పంచాయతీ జిల్లా స్థాయి అధికారుల నుంచి అనుమతులు కూడా తెచ్చుకున్నారు. అయితే గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత చెరువు కట్టకు మరమ్మతులు చేయాలని చెప్పి దౌర్జన్యంగా చెట్లను నరికి ఇప్పటికే సుమారు రూ.5లక్షలు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపించారు. చెరువు కట్టపై సుమారు రూ.10 లక్షలు విలువ చేసే కలప ఉందన్నారు. స్థానిక పోలీసులకు, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. వేలంపాట నిర్వహించేందుకు వీలు లేకుండా పంచాయతీ కార్యదర్శితో బలవంతంగా సెలవు పెట్టించారన్నారు. దీంతో చేసేది లేక గ్రామస్తులు ఏకమై అడ్డుకున్నామన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి పంచాయతీకి చెందిన సహజ సంపదను అధికార పార్టీ నేతకు కాకుండా పంచాయతీకి చెందేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాకు దివ్యాంగుల పింఛన్ పొందే అర్హత లేదా?



నోటీసులు అందించడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న రమణమ్మ

బాలాయపల్లి(సైదాపురం): పుట్టుకతో పోలియో, నడవలేని పరిస్థితిలో 1996 నుంచి అందుతున్న దివ్యాంగుల పింఛన్‌ను కూటమి ప్రభుత్వం తొలగించడంతో మండలంలోని అంబలపూడి గిరిజన కాలనీకి చెందిన యల్లంపల్లి రమణమ్మ కన్నీటి పర్యంతమైంది. బాధితురాలు రమణమ్మ మాట్లాడుతూ తన భర్త కూడా మృతి చెందారని వెనుకా ముందు తనకు ఎవరూ తోడు లేరని వాపోయింది. అధికారులు మాత్రం శనివారం నోటీసులు జారీ చేసి, అందులో ఈ నెల 13వ తేదీన జారీ చేసినట్లుగా వేలిముద్ర వేసుకుని పోయారని విలపించింది.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రాపూరు/సైదాపురం: రాపూరు సమీపంలోని తిక్కన పార్కువద్ద ఉన్న వెంకయ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో వెంకయ్యస్వామి ఆలయంలో ఆరాధన వేడుకలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

మూగజీవాలకు అందని వైద్యం

- మండలానికి ఒకే పశువైద్యుడు



ఓజిలి మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాల కోసం ప్రభుత్వం నిర్మించిన పశువైద్యశాలలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో పశు వైద్యశాలల్లో మౌళిక వసతుల లేమి స్పష్టంగా కనిపిస్తోంది. భవనాలు శిథిలావస్థకు చేరి మందులు, రికార్డులు తడిచిపోయి సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పశువైద్యులతోపాటుగా గ్రామాల్లో విధులు నిర్వర్తించే వెటర్నరీ అసిస్టెంట్లు ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర మండలాలకు వెళ్లడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో గ్రామాల్లో పశువైద్యసేవలు అందడం లేదు. ఈ క్రమంలో వైద్యం కోసం పశువులను ఆస్పత్రులకు తీసుకెళ్లిన రైతులు గంటల తరబడి నిరీక్షించి అవస్థలు పడుతున్నారు. మండలంలోని వజ్జావారిపాళెం, కురుగొండ, ఓజిలి, అత్తివరం, కర్రబల్లవోలు గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. కర్రబల్లవోలు మినహా ఏ గ్రామంలో పశువైద్యాధికారులు లేరు.

శిథిలావస్థలో భవనాలు

మండలంలోని అత్తివరం, వజ్జావారిపాళెం, కర్రబల్లవోలు గ్రామాల్లో పశువైద్యశాల భవనాలు శిథిలాస్థకు చేరాయి. భవనాలు శ్లాబులు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ భవనాల్లో పనిచేసేందుకు సిబ్బంది వణికిపోతున్నారు. ఓజిలి ఆస్పత్రిలో భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షకాలంలో ఇనుపకమ్మలు నుంచి నీరు లీకై రికార్డులు తడిచిపోతున్నాయి. భవనం పిల్లర్లు బీటలువారి ఎప్పుడు కూలిపోతుందోనని బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్నారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఓజిలి, కురుగొండ, వజ్జావారిపాళెం, అత్తివరం పశువైద్యులను బదిలీ చేశారు. ఇప్పటి వరకు పశువైద్యులను కేటాయించలేదు. కర్రబల్లవోలు గ్రామంలో పనిచేస్తున్న వైద్యాధికారి విజయకృష్ణ ఒక్కడే మండలంలో అన్ని వైద్యశాలల్లో ఇన్‌చార్జిగా పనిచేస్తుండడం గమనార్హం. నాయుడుపేట మండలం పండ్లూరు, మేనకూరు వైద్యశాలల్లోను ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నాడు. అన్ని ఆస్పత్రులకు ఒక్కరే వైద్యుడు ఉండడంతో పశువులను ఆస్పత్రికి తీసుకొచ్చి గంటలకొద్దీ పడిగాపులు పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.





శ్లాబు పెచ్చులూడి తడిచిపోతున్న మందులు, రికార్డులు, గొర్రెలకు వైద్యం చేస్తున్న విజయకృష్ణ (ఫైల్)

నేటి నుంచి కార్డులు పంపిణీ



చిల్లకూరు/పెళ్లకూరు: చిల్లకూరు మండలంలో సుమారు 16 వేల మందికి పైగా కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు ఆదివారం తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఏటీఎం (స్మార్ట్) కార్డు సైజులో ఉన్న ఈ రేషన్ కార్డుపై క్యూ ఆర్ కోడ్ ఉంటుందని, దీన్ని అంత సులభంగా దుర్వినియోగం చేయలేరని పేర్కొన్నారు. పెళ్లకూరు మండలంలో 10,687 కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు సన్నద్ధమైనట్లు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ యువరాజ్ తెలిపారు. సోమవారం నుంచి 15 రోజుల పాటు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు.

క్షేత్రస్థాయిలోకి బీజేపీ సంక్షేమ పథకాలు



మోటార్ బైక్ ర్యాలీలో పాల్గొన్న దయాకర్ రెడ్డి

నాయుడుపేటటౌన్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలకు సైతం అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టి బీజేపీని పటిష్టం చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. దయాకర్ రెడ్డి బీజేపీ రాష్ట్ర నాయకునిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం నాయుడు పేటకు రావడంతో ఈ పార్టీ పట్టణ అధ్యక్షులు పాపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి పట్టణంలో మోటార్ బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహిచారు. గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద ప్రూజలు చేశారు. బీజేపీ నాయకులు, పట్టణ ప్రముఖులు దయాకర్ రెడ్డికి శాలువలు కప్పి గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లా లకు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దళితుల వర్గీకరణతో దేశ విభజన

చిల్లకూరు: దేశంలో ఏ రాష్ట్రంలో లేని దళితుల విభజనను చంద్రబాబు చేపట్టడం వల్ల దేశ విభజనకు దారితీసే అవకాశం ఉందని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతా మోహన్ అన్నారు. ఇచ్చాపురం నుంచి దళితులు చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర గూడూరుకు ఆదివారం చేరుకోవడంతో ఈ యాత్రలో పాల్గొన్న చింతా మోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు దళితుల్లో లేని ఆందోళన మొదలైందన్నారు. పక్కనే ఉన్న తమిళనాడు, ఉత్తర ప్రదేశ్‌లో దళిత విభజన చేపట్టలేదని అయితే ఆంధ్రలో మాత్రమే చంద్రబాబు ఇంత దూకుడు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.